



సీతారం ఏచూరి సంతాప సభలో పాల్గొన్న వామపక్ష మద్దతుదారులు, లౌకిక వాదులు, ప్రజాసంఘాల నాయకులు



ఉద్యమ కెరటం సీతారాం ఏచూరి

- జీవితమంతా నిస్వార్థ, నిర్విరామ పోరాటం
- కార్మిక, కర్షక, ప్రజల గొంతుక
- ఆయన ఆశయాలకు పునరంకితం అవుదాం
- సంతాప సభలో వక్తలు
- సిపిఎం ఆధ్వర్యంలో ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం కలెక్టరేట్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రజా పోరాటాల్లో ఉద్యమ కెరటంగా నేటి తరానికి ఆదర్శప్రాయుడైన నాయకుడిగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు సిపిఎంతోపాటు సిపిఐ, సిపిఐ ఎంఎల్, ఎస్‌యుసిఐ, వైసిపి, టిడిపి నాయకులతోపాటు ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంతాప సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, వామపక్ష, లౌకిక వాదులు, ప్రజాసంఘాలు, కవులు, రచయితలు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి విద్యార్థి, ఉద్యమ, రాజకీయ నేపథ్యంను కొనియాడారు.



కాలవ శ్రీనివాసులు



అనంత వెంకటరామిరెడ్డి

తెలుగు కీర్తిని చాటిన సీతారాం : కాలవ

ఢిల్లీలో దక్షిణ భారతదేశం పార్లమెంటేరియన్లపై చులకన భావం, చిన్నచూపు నెలకొన్న పరిస్థితుల్లో తెలుగు వాడైన ఏచూరి ప్రతిభతో ఆ సంస్కృతిని అంతమొందించి తెలుగు కీర్తిని దేశం అంతటా చాటిన ఆదర్శవంతమైన నాయకుడని మాజీ మంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పార్లమెంటేరియన్‌గా, వామపక్ష నాయకుడిగా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశానికి జరిగే ఉపయోగాల కన్న నష్టాలు అధికంగా ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేసి పాలక ప్రభుత్వాలను ఎదురించి ప్రశ్నించిన దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడన్నారు.

ప్రజా హితం కోసం తపన : అనంత

సీతారం ఏచూరి నిరంతరం ప్రజా హితం కోసం పరితపించారని మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఏచూరి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేశారన్నారు. తాను 2004లో పార్లమెంటు సభ్యులుగా ఉన్న సమయంలో ఆయన్ను దగ్గరగా గమనించానని తెలియజేశారు. అప్పట్లో కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ తీసుకురావడంలో, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం రూపకల్పనలోనూ కీలకంగా పనిచేసారని గుర్తు చేశారు. సమాజ శ్రేయస్సు కోసం మొక్కవోని దీక్షతో పోరాడిన యోధుడన్నారు.

నేటి తరానికి ఆదర్శనీయుడు : గేయానంద్

సీతారాం ఏచూరి నేటి తరానికి ఆదర్శనీయుడని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడి పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆర్థిక అసమానతలు, సామాజిక రుగ్మతలు తొలగిపోయి సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని చివరి వరకు పరితపించిన వ్యక్తి అన్నారు.

సిద్ధాంతంపై నిక్కచ్చితనం : విశ్వ

తాను నమ్మని కమ్యూనిజం సిద్ధాంతం కోసం నికచ్చితనంతో జీవితాంతం వరకు నిలిచిన వ్యక్తి సీతారం ఏచూరి అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. 2004లో తాను సిపిఎం తరుపున ఉరవకొండ నియోజకవర్గంలో పోటీ చేసిన సమయంలో ప్రచారానికి విచ్చేసారని గుర్తు చేశారు. సిద్ధాంతం పట్ల నిఖచ్చికంగా ఉండటమే కాకుండా వాటిని దేశంలో అమలుకు కృషి చేసిన వ్యక్తిని తెలిపారు.

దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రజాగొంతుక గొప్ప నాయకుడు ఏచూరిని కోల్పోవడం బాధాకరం అన్నారు.

ఏచూరి స్ఫూర్తితో ముందుకు : రాంభూపాల్

సీతారం ఏచూరి పోరాటం, ముందు చూపును స్ఫూర్తిగా తీసుకుని తాము ముందుకు సాగుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బిజెపియేతర రాజకీయ పార్టీలన్నీ ఒక వేదికపై వచ్చి సీతారాం ఏచూరికి నివాళి అర్పించడం చూస్తే దేశంలో ఆయనకున్న స్థానం ఏమిటో తెలుస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచి తాను నమ్మిన వామపక్ష రాజకీయాల్లో చివరి వరకు నడిచారన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, లౌకికతత్వానికి విఘాతం కలిగిస్తాయని ఏచూరి చెప్పారన్నారు.

మార్క్సిజాన్ని నమ్మిన నేత : శైలు

సమాజాన్ని అనేక రుగ్మతల నుంచి కాపాడటానికి మార్క్సిజం ఒకటే బలమైన సిద్ధాంతంగా అని నమ్మి చివరి వరకు అ పంతాలో నడిచిన నాయకుడు ఏచూరి అని మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కొనియాడారు. సీతారం జీవితం తనకు స్ఫూర్తి అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలనే దిశానిర్దేశం చేసిన గొప్ప ప్రజాతంత్ర ఉద్యమకర్తగా ఏచూరి నిలిచారన్నారు.

చనిపోయినా జీవించిన నాయకుడు : జాఫర్

సీతారాం ఏచూరి చనిపోయినా ఆయన ప్రజా ఉద్యమ పోరాటం ఉన్నంత వరకు గుర్తుంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ తెలిపారు. వామపక్ష నాయకులు బతికున్నప్పుడే కాకండా చనిపోయిన తరువాత కూడా ప్రజల కోసం జీవించి ఉంటారని చెప్పడానికి సీతారాం ఏచూరి జీవితం ఆదర్శమన్నారు. ఆయన చనిపోయాక పార్థివ దేవహాన్ని ఎయిమ్స్‌కు అప్పగించడమే ఇందుకు సాక్ష్యమని చెప్పారు.

విద్యార్థి దశ నుంచే పోరాటం : చంద్రశేఖర్

విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాటం సాగించి, అందులో విజయం సాధించిన నాయకుడు సీతారాం ఏచూరి అని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తెలిపారు. ఏచూరి జెఎన్‌యులో చదువుతున్న సమయంలోనూ తానూ అక్కడే చదివానని గుర్తు చేసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థి నాయకుడిగానే ఆయన సాగించిన పోరాటాలు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. హేతుబద్ధమైన చర్చలు నిర్వహించడంలో ఆయన కీలకంగా వ్యవహరించేవారని తెలిపారు. ఇందిరాగాంధీని రాజీనామా చేయించిన ధైర్యశాలి ఏచూరి అన్నారు.

నిర్దిష్టమైన విశ్లేషణతో ముందుకు : బోస్

వామపక్ష వాదమంటే కేవలం పిడివాదంగానే కాకుండా నిర్దష్టమైన పరిస్థితుల్లో నిర్దిష్టమైన విశ్లేషణతో ముందుకెళ్లే నాయకుడుగా ఆచరణలో చేసిన చూపిన వ్యక్తి సీతారాం ఏచూరి సామాజికవేత్త బోస్ తెలిపారు. దేశంలో వర్గ పోరాటమే కాకుండా సామాజిక పోరాటమూ అవసరమని చెప్పిన గొప్ప వామపక్ష వాది ఏచూరి అని తెలిపారు.

రాజకీయ, అర్థశాస్త్రాలపై పట్టు : ఓబులు

రాజకీయ, అర్థశాస్త్రంలో నైపుణ్యత కలిగిన ప్రజ్ఞాశాలి సీతారం ఏచూరి అని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. దేశ వర్ధమాన రాజకీయాలను ముందుగా అంచనా వేయడం, విశ్లేషించడం ఆయనకు ఆయనే సాటి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం దేశంలో సర్వమతాలు సమానంగా విరాజిల్లాలనే జన చైతన్యం కల్పించిన మహానేత అని కొనియాడారు.

మతోన్మాదాన్ని ఎండగట్టిన నేత : రాఘవేంద్ర

దేశ లౌకిక స్ఫూర్తిని తెలియజేస్తూ మతోన్మాదాన్ని ఎండగట్టిన గొప్ప నాయకుడు ఏచూరి అని ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. మతోన్మాదం పెరిగిపోయి లౌకికత్వాన్ని దెబ్బతీసే ధోరణలను ఆయన నిత్యం ప్రశ్నించారని తెలియజేశారు. సమసమాజ స్థాపనకు జీవితం త్యాగం చేశారని కొనియాడారు.

పలువురి నివాళి


సీతారాం ఏచూరి సంతాప సభలో వక్తలతో పాటు పలువురు నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, ఐఎఫ్‌టియు కార్యదర్శి ఏసురత్నం, సిపిఐఎంఎల్ నాయకులు చంద్రశేఖర్, లలితకళాపరిషత్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచాపాళెం చంద్రశేఖర్, డాక్టర్ ప్రసూన, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, డాక్టర్ బానుకిరణ్, మానవ హక్కుల వేదిక ఎస్ఎం.బాషా, వికే.రంగారెడ్డి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు క్యాప్టన్ షేకన్న, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రచయిత కంబదూరి నబీరసూల్, మానవతా తరిమల అమర్‌నాథ్‌రెడ్డి, మహాబోధి కృష్ణమూర్తి తదితరులు నివాళులు అర్పించారు.



శైలజనాథ్



విశ్వేశ్వరరెడ్డి



చంద్రశేఖర్



వి.రాంభూపాల్



డా॥గేయానంద్



జాఫర్



బోస్



జి.ఓబులు



రాఘవేంద్ర

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు యువత ముందుకు రావాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని సిద్దేశ్వరకాలనీ, కృష్ణాశ్రమం ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, పొదలు, డ్రెయినేజీల్లో పూడిక, చెత్తచెదారం తొలగించి శుభ్రం చేశారు. అలాగే పట్టణంలో ర్యాలీ చేపట్టారు. శిల్ప మాట్లాడుతూ పట్టణ వాసులు చెత్త తరలింపు వాహనాలకు తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలని, ఇంట్లోనే కంపోస్ట్ ఎరువు తయారు చేసేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జ్యోతి, గౌని లావణ్య, గోవింద రాజులు, భాగ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, కోఆప్షన్ సభ్యులు నజీర్ అహ్మద్, నాయకులు ధనార్జున, ప్రవీణ్, రాజు, పారిశుధ్య, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల వలయంలో వెంకటంపల్లి శ్మశానవాటిక

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామంలో ఉన్న శ్మశానవాటికలో సమస్యలు తాండివిస్తున్నాయి.గ్రామంలో 500పైగా కుటుంబాలు ఉన్నాయి. అలాంటి గ్రామానికి చెందిన శ్మశానంలో కంపచెట్లు విపరీతంగా పెరిగిపోయి (శవ సంస్కారాలు) ఖననం చేసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శవ ఖననం తర్వాత కనీసం కాళ్ళు, చేతులు కడుక్కోవడానికి, స్నానాలు చేయడానికి నీటి సదుపాయం లేదని వాపోతున్నారు. ఖర్మకాండ చేశాక మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు లేకపోవడంతో వారి బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. శ్మశానంలో కంపచెట్లు తొలగించి, కాంపౌండ్ వాల్ నిర్మించాలని గత ప్రభుత్వం ఉపాధి హామీ పనుల ద్వారా చేయించాలని నిర్ణయించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అలాగే ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన శ్మశానానికి ప్రహరీతోపాటు నీటి సదుపాయం, తుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గది నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి : ఎంపిపి వాల్మీకి మాధవి

విస్తారమైన స్మశానం ఉన్నప్పటికీ వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. కనీసం నీటి వసతి కల్పించినా ప్రజల బాధలు తీరుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్మశానంలో కనీస మౌలిక వసతులు కల్పించాలి



శ్మశానవాటికలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

అందుబాటులో లేని ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ

చేసిన పనులకు బిల్లులు చెల్లింపులో జాప్యం - గ్రామాల్లో తాగునీటి సమస్యలు



పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-యల్లనూరు

అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పని చేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రభుత్వం చెబుతోంది. ఈ మాటలను బేఖాతరు చేస్తూ యల్లనూరు మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మండల వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో పైప్‌లైన్‌ల లీకేజీ ఇతర సమస్యలతో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ పర్యవేక్షణ చేసి పరిష్కరించాల్సి ఉంది. అయితే ఆ అధికారి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదైనా సమస్యను చెబుతామని గ్రామ ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినా స్పందించడం లేదని సర్పంచులు, ఎంపిటిసిలు చెబుతున్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం
ఉప సర్పంచ్ సూర్యనారాయణ

యల్లనూరు మండల కేంద్రంలో తాను సచివాలయం నిర్మాణం చేశానని, ఇందులో ఎస్టిమేషన్‌కు మించి మరుగుదొడ్లు నిర్మించానని చెప్పారు. వీటికి సంబంధించి రెండు సంవత్సరాల నుంచి బిల్లులు మంజూరు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జెఈని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆ పనులకు సంబంధించి ఇప్పటికీ ఎంబుక్ రికార్డ్ కూడా సిద్ధం చేయలేదన్నారు. మరొక పైప్ లైన్ చేసి రెండు నెలలు కావస్తున్నా దానికి బిల్లులు పెట్టలేదన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మండల వ్యాప్తంగా తాగునీటి పైపు లైన్లు, ఇతర పనులు ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధించి జెఈ నుంచి స్పందన నామమాత్రంగా ఉందని ప్రజా ప్రతినిధులు, తమ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేస్తాం.

విజయశేఖర్ నాయుడు, ఈవోఆర్డీ

వంద రోజుల్లో ఏం చేశారని ఈ ఆర్భాటం..?

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



అనంత వెంకటరామిరెడ్డి

అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో ఏం చేశారని చెప్పేందుకు ప్రజల్లోకి వెళ్తారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వంపై శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వానికి ఐదారు నెలలు సమయం ఇవ్వాలని అనుకున్నామని, అయితే వంద రోజులుగా ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలనే బయటకు వచ్చి మాట్లాడుతున్నామన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉందన్నారు. అయినా రూ.2.27 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేశామన్నారు. అయితే నేడు కూటమి అధికారంలోకి వచ్చేనాటికి ఖజానాలో రూ.7వేల కోట్లు ఉన్నా పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టలేకపోయిందన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి ఎన్ని అమలు చేస్తున్నారో.. చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.99కే క్వార్టర్ మందు ఇస్తామని ప్రగల్బాలు పలుకున్న కూటమి నాయకులు ఈ విషయాన్ని ప్రజల వద్దకు వెళ్లి చెప్పగలరా? అని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ఎలాగూ పోయింది... అక్టోబర్ నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతోంది.. రైతులకు మంచి చేద్దామా అన్న ఆలోచన చంద్రబాబుతో సహా ఎవరికీ రాకపోవడం బాధాకరమన్నారు. రాయలసీమలో వర్షాలు లేకపోయినా నెల ముందుగానే శ్రీశైలం ప్రాజెక్ట్ నిండిందిగానీ 20 రోజులు హంద్రీనీవాకు నీరు వదల్లేదన్నారు. 3850 క్యూసెక్కులు రావాల్సి ఉంటే 2200 క్యూసెక్కులు మాత్రమే వస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇక తుంగభద్ర నుంచి 2400 క్యూసెక్కులు రావాల్సి ఉండగా బార్డర్‌లో 1800 క్యూసెక్కుల కంటే డ్రా చేయని పరిస్థితి ఉందన్నారు. అయితే ఇప్పటికే 9 టీసీఎంలు డ్రా చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చాక జిల్లాలో మట్టి, ఇసుక దోపిడీ సాగుతోందన్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఎమ్మెల్యేలే చెబుతూ పోలీస్‌స్టేషన్ల వద్ద ధర్నా చేశారని గుర్తు చేశారు. ఇక చాలా నియోజకవర్గాల్లో వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద రోజుల కూటమి పాలనలో 'అభివృద్ధి ఆరు అడుగులు వెనక్కు.. అవినీతి మూడు అడుగులు ముందుకు'లా సాగుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు సమిష్టిగా కృషి చేద్దామని ప్రిన్సిపల్ జయరామిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెత్త చెదారం సేకరించి ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భవిష్యత్తులో కలిగే నష్టాలను తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీధర్ అధ్యాపకులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కంది పంటలో తక్షణమే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కెవికె శాస్త్రవేత్త డాక్టర్ శిరీష సూచిం చారు. ఆమె శుక్రవారం కంది పంటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. పూత దశలో ఉన్న కంది పంటకు చీడ పీడల నివారణకు మందులు పిచికారి చేయాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పంటలను పరిశీలిస్తూ, సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంట దిగుబడి ఆశాజనకంగా వస్తుందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఇఒ ఓబుళపతి తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానంలో శుక్రవారం ఆయన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. పోటీల్లో బ్రహ్మసముద్రం, పాల వెంకటాపురం, గుండిగాని పల్లి, ఎస్.కోనాపురం, అంబేద్కర్ గురుకుల పాఠశాల, కెజిబివి విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 బాలికల పోటీలలను హెచ్ఎం చంద్రమౌళి, ఎంఇఒ ఓబుళపతి, మండల కోఆర్డినేటర్ ఇబ్రహీం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో క్రీడల కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. అండర్-17 కబడ్డీ పోటీల్లో దీప్తి, సమీర, శ్వేత, దీక్ష, మేఘన, లహరిప్రియ, సింధు, మౌనిక, లతశ్రీ ఎంపికయ్యారు. అండర్-14 షాట్ పుట్‌లో పవిత్ర, పావని, అండర్-17లో దీపిక, బేబీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అండర్-14 వంద మీటర్ల పరుగు పందెంలో జి.నాగవేణి, లిల్లీ, అండర్-17 షాట్‌పుట్‌లో దీపిక, బేబీ, అండర్-14 లాంగ్ జంప్‌లో జి.నాగవేణి, అశ్విని ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థినులు తాలూకా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. పోటీల్లో ఆయా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల బృందం, పిఇటిలు, పిడిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

నిరంతరం సేవకుడిలా పని చేస్తా

'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రజల కోసం నిరంతరం సేవకుడిలా పని చేస్తానని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా రామసాగరం సమీపంలో ఉన్న పెన్నానది ఒడ్డున వెలసిన బూదిగుమ్మ సంజీవరాయుడు స్వామి, పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఆరు మోటార్లు బిగించి పిల్ల కాలువల ద్వారా చెరువులకు నీరు నింపామన్నారు. అవసరమైతే మరో 12 మోటార్లతో కృష్ణాజలాలను అందించి రైతులు ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్‌డిఒ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ షర్మిల, డిఎల్‌డిఒ శంకర్‌రావు, సర్పంచి రామకృష్ణమ్మ, టిడిపి నాయకులు ప్రసాద్, రాధాకృష్ణ, మల్లికార్జున, పెద్దతిప్పయ్య, తిమ్మప్ప, వెంకటనాయుడు, కంచరాముడు, రామ్మోహన్‌నాయుడు, నరిగన్న, మాలపాటి శివారెడ్డి, చంద్రానాయక్, విజయ్, శివ, ఇరుపాపల్లి రాధాకృష్ణ, బాలాజీ, చంద్రశేఖర్, ఎర్రే గౌడు, రాము, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, జెఇ సుధాకర్, విద్యుత్ శాఖ అధికారి గంగాధర్, ఎఇ పృథ్వీసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కాగా వరద బాధితుల కోసం శ్రీనివాస విద్యానికేతన్, సన్‌రైజర్స్ పాఠశాలలు, నిస్వార్థ ఫౌండేషన్, స్వాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాల చెక్కులను మంత్రికి అందజేశారు. అలాగే నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు 20 సెంట్లు స్థలం కేటాయించాలని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పుట్లూరు : మండలంలోని చలివేముల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వందరోజుల్లోనే ఐదు హామీలను నెరవేర్చిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రామలింగారెడ్డి, మండల ఇంజినీర్ యలమనాయుడు, ఎంఇఒ శ్రీదేవి, టిడిపి నాయకులు బాల రంగయ్య, సుదర్శన్‌నాయుడు, వాసుదేవరెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, ఓబుళాపురం శ్రీనివాసులు నాయుడు, కడవకల్లు గోవర్ధనరాజు, సంజీవపురం పవన్‌కుమార్‌రెడ్డి, కందికాపుల సర్పంచి శివరామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబుళనాయుడు, రవికుమార్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, నారాయణరెడ్డిపల్లి రామమునిరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, వెంకట శివారెడ్డి, ఓబులాపురం ప్రసాద్, చింతకుంట జయరామ్‌రెడ్డి, చెర్లోపల్లి రవికుమార్, సూరేపల్లి వేణు, బాలాపురం శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఎంతో మేలు చేసి చూపించామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రుద్రంపేట పంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేస్తే.. కేవలం వంద రోజుల్లోనే అనేక హామీలు నెరవేర్చుమన్నారు. ముఖ్యంగా పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్లు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఓవైపు వరదలు, మరోవైపు అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, పంచాయతీ సెక్రటరీ మల్లికార్జునరెడ్డి, టిడిపి నాయకులు రాయల్ మురళి, గంగారామ్, సరిపూటి రమణ, సాకే లక్ష్మీనరసింహ, పోతుల లక్ష్మీనరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, భక్తవత్సలం నాయుడు, ఎస్‌ఎం.బాషా, నాగభూషణం, సుధాకర్, బోయపాటి బాలప్ప, కుమార్‌నాయుడు, ఖాసీం, వడ్డే వెంకటరాముడు, వెంకటారాముడు, ఉప్పర మహేష్, సీనప్ప, నాగ, శివ, అంజి, ఉప్పర ఆది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అధికారులు, ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కుంబారుగుండ వీధిలో కౌన్సిలర్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఫణికుమార్, కౌన్సిలర్లు జ్యోతి, ప్రశాంతి, మాజీ సభ్యులు టంకశాల హనుమంతు, సంపత్ కుమార్, పురుషోత్తం, భారతి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కౌన్సిలర్ పద్మ, గోవింద, ఫక్రుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఇనాయత్‌బాషా, ధనార్జున, నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ప్రజా సంక్షేమ పాలనకు వంద రోజులని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మండ లంలోని సిబాయి గ్రామంలో శు క్రవారం సర్పంచి కవిత బుజ్జన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎమ్మెల్యే 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజు ల్లోనే అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిం దన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దశల వారీగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసేం దుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రాణిసుష్మిత, తహశీల్దార్ భాస్కర్, నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, వైపి.రమేష్, వెంకటేశులు, రమేష్, బుజ్జన్న, రామ్మోహన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



బెలుగుప్పలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల

ఇసుక బండ్ల నిర్వాహకుల బైండోవర్

పామిడి : మండల కేంద్రం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న ఎద్దుల బండ్ల నిర్వాహకులను సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో శుక్రవారం బైండోవర్ చేశారు. ఇందులో భాగంగా దాదాపు 12 మందిని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, సీఐ యుగంధర్ మాట్లాడుతూ పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన సచివాలయ సిబ్బంది బదిలీల కౌన్సిలింగ్

అనంతపురం కార్పొరేషన్ : ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఆరు విభాగాల్లో స్థానిక కౌన్సిల్ హాల్‌లో సచివాలయ సిబ్బందికి నిర్వహించిన కౌన్సిలింగ్ మంగళవారం ముగిసింది. మున్సిపల్ ఆర్‌డి విశ్వనాథం, కమిషనర్ నాగరాజు పర్యవేక్షణలో కౌన్సిలింగ్ సాగింది.

శాంతి భద్రతలపై నిఘా ఉంచాలి : డీఎస్పీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె : మండలంలో శాంతి భద్రతలు, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా పెండింగ్ కేసుల వివరాలను స్థానిక ఎస్ఐ గౌస్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో జరుగుతున్న గ్యాంబ్లింగ్, మట్కా వంటి వాటిపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఫిరోజ్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు

పెద్దవడుగూరు : మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లో సాగు నీటి పంట కాలువల్లో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా పనులను ఎపిఒ పుల్లారెడ్డితోపాటు సాంకేతిక సహాయకులు శుక్రవారం పర్యవేక్షించారు. మండలంలోని చిన్నవడుగూరు, గుత్తిఅనంతపురం, దిమ్మగుడి, పెద్దవడుగూరు, మేడిమాకులపల్లి, తదితర గ్రామాల్లో పంట కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్లు ఎపిఒ తెలిపారు.

వరద బాధితులకు విరాళం

అనంతపురం రూరల్ : విజయవాడ వరద బాధితుల కోసం అనంతపురానికి చెందిన ఏఎన్‌ఆర్ టమోటా మండి గురు, సెవెన్ హిల్స్ టమోటా మండి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకుడు మణికంఠ బాబు కలిసి రూ.5లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు అందరూ కలిసి సంబంధిత చెక్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందజేశారు.

మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పుట్లూరు


పుట్లూరు మండలంలో మాట్లాడుతున్న అతిథులు

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పాఠశాలల మండల స్థాయి క్రీడాపోటీలను మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీలు మురళి, పక్కీరప్ప, జ్యోతి జ్యోతి, పవన్ కుమార్, మళ్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈపోటీలను సర్పంచి తిరుపాల్, మండల కన్వీనర్ కొండప్ప, విద్యాకమిటీ ఛైర్మన్ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు సాంబశివ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి నియోజకవర్గస్థాయిలో పాల్గొనడానికి జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల క్రీడాపోటీల మండల కన్వీనర్ ఎన్.కేశవమూర్తి, బి.రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్‌లో శ్రీగంధం చెట్లు నరికివేత

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రం సమీపంలోని ఫారెస్ట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్లు నరికివేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫారెస్టు గార్డ్ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. ఫారెస్టులో ప్రకృతి వరంగా పడిన 4 శ్రీగంధం మొక్కలను గుర్తు తెలియని దుండగులు నరికివేశారన్నారు. సుమారు ఆరు రోజుల క్రితం నరికి చిన్న చిన్న దుంగలు చేసుకుని ఎత్తు కెళ్లారన్నారు. అవగాహన కలిగిన వ్యక్తులే ఈ పని చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై ఫారెస్ట్ అధికారులతోపాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామ్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే పంచనామా నిమిత్తం అక్కడ పడి ఉన్న చెక్కలను ల్యాబ్ పంపినట్లు వివరించారు.


నరికిన శ్రీగంధం మొక్కను పరిశీలిస్తున్న ఫారెస్టు గార్డు సుధాకర్

తాడిపత్రి డీఎస్పీగా రామకృష్ణుడు



తాడిపత్రి : తాడిపత్రి పోలీస్ సబ్ డివిజినల్ అధికారిగా రామకష్ణుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన జనార్ధన్‌నాయుడు పదోన్నతిపై వెళ్లగా ఇంటెలిజెన్స్ విభాగంలో ఉన్న రామకృష్ణుడును ఇక్కడికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణం కొనసాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాడిపత్రి తహశీల్దార్‌గా రజాక్



తాడిపత్రి రూరల్ : మండల తహశీల్దార్‌గా రజాక్‌వలీ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై తాడిపత్రికి వచ్చానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామని వివరించారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థికసాయం

గుత్తి : కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఆటో డ్రైవర్‌కు తోటి ఆటో డ్రైవర్లు చేయూతనిచ్చారు. గుత్తి ఆర్‌ఎస్‌లో నివాసం ఉండే ఖాదర్‌బాషా ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఈనేపథ్యంలో కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి ఆటో డ్రైవర్లు కలిసి పోగు చేసిన రూ.7,600 ఆర్థిక సాయాన్ని బాధితుడి ఇంటికి వెళ్లి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఆటో నజీర్, తదితరులు పాల్గొన్నారు.

'విజన్ స్వర్ణాంధ్ర 2047'పై అధికారుల సమావేశం

ప్రజాశక్తి-పుట్లూరు

వికసిత్ భారత్ ఎ 2047లో భాగంగా స్వర్ణాంధ్ర ఎ 2047 ఐదేళ్లలో విజన్ ప్లాన్ చేయడానికి శుక్రవారం మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ యోగానందరెడ్డి మాట్లాడుతూ ఈనెల 30వతేదీలోపు విజన్ ప్లాన్ పూర్తి చేసి వచ్చేనెల 21 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ ప్రజలను విజన్ ప్లాన్‌పై భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. మండలంలో ప్రతి అధికారి వారి విభాగాల్లో పురోగతి, అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు, వ్యూహాలు నోడల్ అధికారికి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలం ఇంజినీర్ యల్లం నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రామలింగారెడ్డి, ఎంఇఒ శ్రీదేవి, యుఆర్‌డి ఆనందప్రసాద్, ఏఎస్‌ఓ విజయ్‌కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్-2047పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ కల్పన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 2029నాటికి మండల అభివృద్ధి ఎలా అనే అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఇఒఆర్‌డి విజయ్ శేఖర్‌నాయుడు, ఎపిఒ షబ్బీర్, ఎపిఎం ముత్యాలప్ప, పంచాయతీ ఇంజినీర్ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలు

అనంతపురం కలెక్టరేట్ : నేడు నిర్వహించనున్న ప్రముఖ రచయిత గురజాడ అప్పారావు జయంతి వేడుకలు జయప్రదం చేద్దామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులతో నిర్వహిస్తున్న సెమినార్‌కు ముఖ్య అతిథులు కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, ఇవా రచయిత అంకె శ్రీనివాసులు, రిటైర్డ్ టీచర్ రియాజుద్దీన్ తదితరులు హాజరై గురజాడ రచనలపై ప్రసంగిస్తారని తెలిపారు. గురజాడ జయంతిని ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నార్పలలో 'వేస్ట్ టు ఆర్ట్'

నార్పల : స్వచ్ఛత హి సేవలో భాగంగా మండల కేంద్రంలోని ఎంజెపిఎపి బీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో శుక్రవారం వేస్ట్ టు ఆర్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్‌తోపాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపకులు అనంతపురం అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ కళాశాలలో దాదాపు రెండున్నరేళ్లుగా తాము వివిధ పర్యావరణహిత కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కిషోర్‌కుమార్, ప్రిన్సిపల్ సంగీత, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రయివేటీకరణ తగదు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-గుత్తి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం సరికాదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ అన్నారు. ఈవిద్యా సంవత్సరానికి నూతన వైద్య కళాశాలలను నడపలేమని ఎన్‌ఎంసీకు ప్రభుత్వం లేఖ రాయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని గాంధీ కూడలిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న 12 ఎంబిబిఎస్ కళాశాలలు పూర్తి చేయాలన్నారు. ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, పాడేరు ప్రాంతాల్లో మెడికల్ కళాశాలలు పూర్తయ్యాయని చెప్పారు. ఆ కళాశాలలు ప్రారంభిస్తే 700 సీట్లు పూర్తి చేయొచ్చు అన్నారు. ప్రభుత్వం ప్రవేటు వైద్య కళాశాలలకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్స్ రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలలో మూసివేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బాలు, నవీన్ యాదవ్, శివ, శశి కుమార్, వినోద్‌కుమార్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి తహశీల్దార్‌గా రజాక్

కుష్టువ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ


కుష్టువ్యాధి కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

గుత్తి : ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప ఆధ్వర్యంలో శుక్రవారం కుష్టు వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధితో బాధపడుతున్న నలుగురికి వైద్య చికిత్సల నిమిత్తం కిట్లు అందజేశామన్నారు. కుష్టు వ్యాధి రోగులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 12 మందిని శాస్త్ర చికిత్సలకు ఎంపిక చేసామని తెలిపారు. వారందరికి పలమనేరు ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారన్నారు. అక్కడ రోగులకు భోజనం, వసతి కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ వైద్యులు వెంకటేశ్వర్లు, పిటి పీటర్, రామచంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-అనంతపురం

మాజీ సైనికుల కోసం రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తోపాటు కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాజీ సైనికులకు ఉద్యోగ కల్పనకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలపడం హర్షణీయమని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేకన్న అన్నారు. శుక్రవారం నగరంలోని మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి యువనేత లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో అప్పటి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో కూడేరులో కలిసి మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించామని గుర్తు చేశారు. ఇందుకు స్పందిస్తూ అధికారంలోకి వచ్చిక కార్పస్ ఫండ్‌తోపాటు కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, బిఎ.హుస్సేన్, హుస్సేన్‌బాషా, ఖాజాసాబ్, ఇస్మాయిల్ షఫీ, బాల నాగరాజు పాల్గొన్నారు.

రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కారం

అనంతపురం : మంచిర్యాల జిల్లా లక్షెట్టిపల్లికి చెందిన రచయిత లేదాళ్ల రాజేశ్వర రావుకు విమలాశాంతి కవితా పురస్కారం అందజేయనున్నట్లు సాహిత్య సేవాసమితి అధ్యక్షులు శాంతి నారాయణ, కార్యదర్శి ఉప్పరపాటి వెంకటేశులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' అనేక కవితా సంపుటికి పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈమేరకు వచ్చేనెల 10వ తేదీన అనంతపురంలో నిర్వహించనున్న సాహిత్య సభలో రాజేశ్వరరావుకు పురస్కారంతోపాటు రూ.10వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు వివరించారు.

సమాజహితం కోసం కృషి చేయాలి

జెఎన్‌టియు విసి ఓఎస్‌డి ఎన్.దేవన్న

ప్రజాశక్తి-అనంతపురం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి ఓఎస్‌డి ఎన్.దేవన్న

ఇంజినీరింగ్ కళాశాలలు విద్యాబోధనతోపాటు సమాజ హితం కోసం కృషి చేయాలని జెఎన్‌టియు ఉపకులపతి ఓఎస్‌డి ఎన్.దేవన్న పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వర్సిటీ పరిపాలన భవనంలోని ఆర్య భట్టా ఆడిటోరియంలో భారత ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నస్ ఫేజ్-3 ప్రాజెక్టు, సెంటర్ పర్ డెవలప్ మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ సహకారంతో 'సైబర్ అవేర్నెస్ డిజిటల్ నాగ్రిక్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కళాశాలల అధ్యాపకులు అవగాహన సదస్సుపై అవగాహన చేసుకుని వారి కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ క్యాక్రమంలో డైరెక్టర్ అఫ్ ప్యాకల్టీ డెవలప్‌మెంట్ జి.ప్రశాంతి, రీసోర్స్‌పర్సన్, సి-డాక్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.జగదీష్‌బాబు, డాక్టర్ సి.రామకృష్ణయ్య సీఐసో, వర్సిటీ డైరెక్టర్లు, అధ్యాపకులు, విభాగాల ఆధిపతులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం'

యల్లనూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా శనివారం నుంచి 'మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇఒఆర్‌డి విజయశేఖర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించనున్నట్లు తెలిపారు.

పోలీసుల గ్రీవెన్స్

అనంతపురం క్రైం : పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా బదిలీలు, సస్పెన్షన్ రీఓక్, ఇతర సమస్యలపై సిబ్బంది 08 పిటీషన్లు అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల సమస్యలు వింటున్న ఎస్పీ పి.జగదీష్

'భగత్‌సింగ్' యూనియన్ పోరాటంతో కార్మికుడికి న్యాయం

అధిక వడ్డీని ఉపసంహరించుకున్న ఫైనాన్స్ సంస్థ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఆటో రంగంపై ఆధార పడి జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులకు ఫైనాన్స్ సంస్థలు విధిస్తున్న అధిక వడ్డీలతో ఇబ్బందులు ఎదుర్కొన్న కార్మికుడికి భగత్‌సింగ్ ఆటో యూనియన్ పోరాటంతో న్యాయం జరిగింది. ఆటో కార్మికుడు మస్తాన్ ఆటోను పద్మప్రియ ఫైనాన్స్ సంస్థ సీజ్ చేసింది. విషయం తెలుసుకున్న సిఐటియు అనుబంధం భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు సదరు పద్మప్రియ ఫైనాన్స్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నగర రెండు కమిటీల అధ్యక్షుడు ఆజాము, కార్యదర్శి ఆదినారాయణ, ట్రెజర్ రామలింగయ్య రెడ్డి, 1వ నగర కమిటీ కార్యదర్శి ఎన్టీఆర్ సీనా, అధ్యక్షులు వడ్డే నాగరాజు మాట్లాడుతూ ఆటో సీజ్ చేస్తే ఉపాధి కోల్పోయి మీకు డబ్బులు ఎలా కడతారని ప్రశ్నించారు. అధిక వడ్డీలు విధిస్తూ, పార్కింగ్ చార్జెస్ అంటూ భారం మోపడం సరికాదని మండిపడ్డారు. మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితిని కల్పించడం సరికాదన్నారు. కార్మికుడికి ఆటో ఇచ్చి కొంత సమయం కల్పిస్తే ఫైనాన్స్ చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. అధిక వడ్డీ, ఓడిలు, పార్కింగ్ చార్జీలు ఉప సంహరించాలని కోరారు. దీంతో స్పందించిన సదరు ఫైనాన్స్ సంస్థ మేనేజర్ కార్మికుడి ఆటో రీలిజ్ చేశారు. విధించిన వడ్డీ రూ.10 వేలు ఉప సంహరించుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. చివరిలో ఓడిలో కూడా తగ్గిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సదరు కార్మికుడు సంస్థ యాజమాన్యానికి, సిఐటియు నేతలకు ధన్యవాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ సభ్యులు జీవా, బుల్లె రాజు, సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నిజాం, మహిళా ఆటో డ్రైవర్ స్వాతి, కవిత, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వాడకం ఆరోగ్యానికి హానికరం

అనంతపురం : మత్తు పదార్థాల వాడకం ఆరోగ్యానికి చాలా హానికరమని సిఐ కె.సాయినాథ్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని రామ్‌నగర్ ప్రభుత్వ బీసీ బాలికలు, బాలుర వెల్ఫేర్ హాస్టళ్లలో 'మత్తు పదార్థాల వాడకం ఆరోగ్యానికి హానికరం' అనే వెనుకబడిన తరగతుల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కుష్బూకొఠారి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయన్నారు. కావున డ్రగ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగరూరు రసూల్, డాక్టర్ ఎం.బాలాజీనాయక్, డాక్టర్ వెంకటలక్ష్మి, ఎన్‌సిసి ఆఫీసర్ రంగనాథ్, జూటూరు రమేష్, హెచ్‌డబ్ల్యూఒ ఉషా, రాజేశ్వరి, వరలక్ష్మి, ఏబీసీడబ్ల్యూఒ తాడిపత్రి రంగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు హద్దులు చూపాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


అనంతపురం రూరల్ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

అనంతపురం రూరల్ మండల పరిధిలోని కురుకుంట పొలం 41 సర్వే నెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొలిచి హద్దులు వేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు బిసిఆర్.దాస్ కోరారు. ఈమేరకు అనంతపురం అర్బన్, రూరల్ మండల తహశీల్దార్లు హరికుమార్, మోహన్‌కుమార్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బిసిఆర్.దాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పై ఆలస్యం చేయకుండా వారిని అనవసరంగా ఆఫీసులు చుట్టు తిప్పుకోకుండా పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొందరు రెవెన్యూ, సర్వే అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడి పేదలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కురుకుంట ఎంఆర్‌పిఎస్ కార్యకర్తల ఇళ్ల స్థలాల విషయంలో సర్వేయర్ ప్రతాప్ రెడ్డి రికార్డులు తారు మారు చేసి గత అధికార పార్టీ ప్రజా ప్రతినిధి, అనుచరులకు లాభం చేకూర్చేందుకు సహకరించాడని తెలిపారు. ఇలాంటి అధికారుల పట్ల పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని, తక్షణమే సర్వే నెంబర్ 41లో ఇళ్ల స్థలాలను సర్వే చేసి కొలతలు హద్దులు వేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్లు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రామంజీ, ఓబుల పతి, రాము, కుళ్ళయప్ప, శివ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాటజూదరులు అరెస్టు

అనంతపురం క్రైం : అనంతపురం సబ్-డివిజనల్ పోలీస్ అధికారి ప్రతాప్ ఆదేశాల మేరకు అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.శ్రీకాంత్ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక నాయక్‌నగర్ బయటి ప్రదేశాల్లో పేకాట ఆడుతుండగా ఆరుగురిని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.23,100 నగదు స్వాదీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శింగనమల : మండల పరిధిలోని గుమ్మేపల్లి క్రాస్, పాపినేపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాపై గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనేపథ్యంలో పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

పామిడి : మండలంలోని పొగురూరు గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కావున ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శివలక్ష్మి, ఎంపిపి స్కూల్ టీచర్ ప్రకాష్‌రెడ్డి, మహిళా పోలీస్ లక్ష్మీదేవి, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని చింతవనం కొట్టాల అంగన్వాడీ కేంద్రం–3లో ఐసిడిఎస్ సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా తృణ ధాన్యాలు, వాటి ప్రాధాన్యత ప్రయోజనాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాలిని, మధుమాలిని, కోఆర్డినేటర్ లావణ్య, అంగన్వాడీలు రేణుక, లక్ష్మి, విమల, ప్రమీల, గర్భిణీలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల్లో ప్రజలకు చేసింది శూన్యం..!

అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు పంగనామాలు పెట్టారని వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలకు పెట్టిన పంగనామాలను మరిపించడానికే తిరుపతి లడ్డు వ్యవహారాన్ని తీసుకొచ్చారన్నారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు పింఛన్ మినహా చేసింది ఏమీ లేదన్నారు. వంద రోజుల పాలనపై ప్రజలకు చేసిన మోసాలను కూటమి నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.


బాల్య వివాహాలపై అవగాహన

యల్లనూరు : మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం–1లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం శ్రీదేవి, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకి విశేష స్పందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణంలో నిర్వహించిన జాబ్‌మేళాకి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల, అనంతపురం సహకారంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా అనంతపురం నియోజకవర్గంలో జాబ్ మేళా స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ జాబ్ మేళాకి 7 కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా, సుమారు 340 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు మరిన్ని జరగాలన్నారు. జిల్లాలోని యువత ఇటువంటి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కడ అవకాశాలు ఉన్నా నిరుద్యోగులు వినియోగించుకోవాలని, ప్రతి ప్రభుత్వ శాఖలు ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో జాయింట్ కలెక్టర్ మొక్కలు నాటడం జరిగింది. ఈ జాబ్ మేళ కార్యక్రమంలో ఆన్సెట్ సీఈవో కరుణ కుమారి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి, ఎపిఎస్ఎస్డిసి జిల్లా నైపుణ్య అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, సీడాఫ్ జేడీఎం సూర్య నారాయణ, నైపుణ్యాభివద్ధి సంస్థ, సీడాప్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జాబ్‌మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-నార్పల

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి మొక్కలను నాటి పెంచాలని ఎంపిడిఒ దివాకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గూగుడు రోడ్డులో ఎంఇఒ నారపరెడ్డి, ఇఒఆర్‌డి శైలజారాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలను నాటుకుని సంరక్షించుకోవాలన్నారు. అనంతరం గూగూడు రోడ్డు చింతవనం కొట్టాలలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, ఎపిఒ ఎర్రమ్మ, ఎపిఎం తిప్పమ్మ, పంచాయతీ కార్యదర్శులు చరణ్, పరుశురాం, శ్రీనివాసులు, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచి లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి రమణకుమార్ ఆధర్వంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి చంద్రమౌళి మొక్కల పెంపకంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచి మల్లేల జగదీష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్ప, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో మొక్కలు నాటుతున్న సర్పంచి, అధికారులు


గుత్తిలో మొక్కలు నాటుతున్న ఛైర్‌పర్సన్ కమిషనర్

గుత్తి : మొక్కలు పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ బి.జబ్బార్‌మియా సూచించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న రామాలయం, శివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ హేమచంద్ర, టిపిఎస్ మహబూబ్‌జాన్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ నెట్టికల్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, నాయకులు ఎస్ఎం.బాషా, జక్కులచెరువు ప్రతాప్, చికెన్ శీనా, హెచ్ఎం.రసూల్, రామకృష్ణ, జనసేన నాయకులు చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పలు పంచాతీల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. అలాగే మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎస్‌కెయు కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సోముశేఖర్, ఎన్ఎస్–ఎస్ పిఒ పి.సత్యసౌమ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్పు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక కణేకల్–బళ్లారి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ లైన్ తక్కువ ఎత్తులో ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందాయని దీంతో విద్యుత్ లైన్ ఎత్తు పెంచినట్లు ఏఈ లక్ష్మిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న మార్కెట్, శ్మశనవాటిక, దళితవాడ సమీపంలో పాత విద్యుత్ స్తంభాలను మార్చి కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారు. ఈ విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్యలు తలెత్తవని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్‌మెన్ హనీఫ్‌బాషా, సచివాలయ సిబ్బంది రామంజి, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామి లడ్డు వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చి మత విద్వేషాలను రెచ్చగొట్టకుండా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి సూచించారు. శుక్రవారం స్వగ్రామం కొనకొండ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారని సిఎం చంద్రబాబు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. గతంలో టిటిడి ఛైర్మన్లుగా పని చేసిన వై.వి.సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తిరుమల పవిత్రత, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ సేవ చేశారు. లడ్డు తయారీలో ఎలాంటి రాజీ పడలేదన్నారు. నాణ్యతా ప్రమాణాలన్నీ పరిశీలించిన పిమ్మటనే ప్రసాద వినియోగానికి వస్తువులు వినియోగించారన్నారు. కేవలం దేశీయ ఆవుపాలతో తయారు చేసిన నెయ్యి, సేంద్రీయ సాగు ద్వారా పండించిన ఉత్పత్తులతోనే ప్రసాదాలు తయారు చేశారని గుర్తు చేశారు. రాజకీయాలను మత విశ్వాసాలు, భగవంతుడిని కేంద్ర బిందువుగా చేసుకుని చేయకూడదని హితవు పలికారు. ఇప్పటికైనా కూటమి నాయకులు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు మానేసి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, తిప్పారెడ్డి, రమణయాదవ్, జయేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, ఆమిద్యాల చెన్నబసన్నగౌడ్, శివలింగ, తిరుపాల్‌యాదవ్, మహాలింగ, రామచంద్ర, లాలెప్ప, గురుస్వామి, కేశన్న, ముష్తూరు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా జిల్లాలోని పాఠశాల, కళాశాలలో, ఐటిఐ, పాలిటెక్నిక్, యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్కోఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, NCORD) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీ జగదీష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలని, ఎన్ఫోర్స్‌మెంట్ పక్కాగా చేపట్టాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా ప్రతి పాఠశాల, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించాలని, డ్రగ్స్ వాడడం వల్ల కలిగే వ్యతిరేక ప్రయోజనాలు ఏంటి అనేదానిపై తెలియజేయాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గ్రామాల వారిగా వాహనం ఏర్పాటు చేసి వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై వీడియోలను ప్రదర్శించాలన్నారు. అన్ని విద్యాశాఖ వారితో సమన్వయం చేసుకొని పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ నో డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వసంత బాబు, డిటిసి వీర్రాజు, ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో మారుతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలో ఆర్‌టిఐని అధికారులు నిర్వీర్యం చేయడం బాధాకరమని ఆర్‌టిఐ మండల అధ్యక్షుడు గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌టిఐ ద్వారా కోరిన సమాచారాన్ని సమగ్రంగా అందించడంలో తహశీల్దార్, కార్యాలయ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, రెండెకరాలు చొప్పున ప్రభుత్వ భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని గడువు లోపు ఇచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో ఆర్‌టిఐ నాయకులు శ్రీనివాసులు, రంగస్వామి, ఈరన్న, కృష్ణమూర్తి, సిపిఐ నేత రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.